ప్రజల సొమ్ము దుర్వినియోగం

ప్రమాదకరంగా మారుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్


ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో కుంగిపోయిన మ్యాన్‌హోల్


ఆస్‌బెస్టాస్ కాలనీ ప్రధాన రహదారిలో ధ్వంసమైన మ్యాన్‌హోల్


బాగ్‌అమీర్‌లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్

ఆల్విన్‌కాలనీ: నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కాంట్రాక్టర్లు అందించే ఆమ్యామ్యాలకు అలవాటుపడి తూతూ మంత్రంగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌ను నిర్మించటంతో ప్రజా సొమ్ము దుర్వినియోగం అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మ్యాన్‌హోల్ నిర్మించి రోజులు గడవకముందే పూర్తిగా కుంగిపోవటంతో పాటు మ్యాన్‌హోల్స్ పైన ఉండే పై కప్పులు పగిలిపోయి ప్రమాదకరంగా మారుతున్నాయి. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో ఆస్‌బెస్టాస్ కాలనీ, ఆల్విన్‌కాలనీ, వెంకటేశ్వరనగర్, ఎల్లమ్మబండ, తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్‌పై మూతలు పగిలిపోయి ప్రయాణికులు, పాదచారుల పాలిట ప్రాణసంకటంగా మారాయి. నిర్మాణాలు చేపట్టేటప్పుడు అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం కారణంగా ప్రతి కాలనీ, వీధుల్లో, బస్తీలోని మ్యాన్‌హోల్స్ పూర్తి కుంగిపోయి ధ్వంసం కావటంతో వాహనదారులకు ఎక్కడ ఏ మ్యాన్ హోల్ కుంగి పోయి ఉందో అర్థం కాక వేగంగా వస్తున్న వాహనాలు మ్యాన్‌హోల్ గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. గత నాలుగు రోజులు క్రితం కురిసిన చిన్నపాటి వర్షాలకే ద్విచక్ర వాహనదారులు కుంగిపోయిన మ్యాన్‌హోల్స్‌లో ఇరుక్కుపోయి కిందపడి గాయాలతో ఆసుపత్రిపాలయ్యారు. వాహనాలు కూడా రిపేర్‌కు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు స్పీడ్ బ్రేక్ కొట్టడం ద్వారా మ్యాన్‌హోల్ వద్ద ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేసేటప్పుడు సంబంధిత ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపంతో మ్యాన్‌హోల్స్ చుట్టూ నిర్మించే కాంక్రీట్ ఇటుకలకు వాటర్ క్యూరింగ్ చేయకుండా కనీసం ప్లాస్టరింగ్ కూడా చేయకుండా తూతూ మంత్రంగా నిర్మాణం చేపట్టి పై కప్పు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొని మమ అనిపించుకుంటున్నారు. పదే పదే మ్యాన్‌హోల్ మరమ్మత్తులు చేపట్టామని అధిక బిల్లులు వసూలు చేసుకుంటూ పబ్బం గడుపుకుంటూ ప్రజా సొమ్మును దోచుకు తింటున్నారని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. నిర్మాణం చేపట్టిన మూణ్నాళ్లకే అవి కాస్తా కుంగిపోయి నోరు తెరుచుకొని బావురుమంటూ ప్రాణ సంకటంగా మారుతున్నాయని పలుమార్లు స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు అధికారులను, నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నారని మరోసారి సమస్య వచ్చిందని ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు. నిర్మాణం చేపట్టి మమ అనిపించకుండా థర్డ్ పార్టీ పరిశీలన చేపట్టిన తరువాతే సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు వచ్చేలా.. పదే పదే సమస్య పునరావృతం అయితే అటువంటి కాంట్రాక్టర్‌కు మరోసారి నిర్మాణ పనులు అప్పగించకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు ప్రజా సొమ్ము దుర్వినియోగం కాకుండా ప్రజల అవసరాలకు విలువైన సొమ్ముతో నాణ్యతా ప్రమాణాలతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు ఉగాది పురస్కారాలు, రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం

కూకట్‌పల్లి: విశ్వభారతి మ్యాక్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి నిర్వహణలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాలు, రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం ఆదివారం ఉదయం 9.30 గంటలకు కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ వద్ద, విశ్వనాథ్ థియేటర్ వెనుక వైపు నిర్వహించనున్నట్లు తెలుగు భాషా చైతన్య సమితి చైర్మన్ బడేసాబ్ ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ట్యాగ్‌లైన్ కింగ్ ఆలపాటి, సభాధ్యక్షులుగా ప్రముఖ కవి, విమర్శకుడు రామకృష్ణ చంద్రమౌళి, విశిష్ట అతిథులుగా విశ్వభారతి మ్యాక్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ సిఇఓ కె. దయానంద్ తెలిపారు.

రేషన్ దుకాణాన్ని వినియోగించుకోవాలి

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ ఎక్స్‌టెన్షన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చౌకధరల దుకాణం డీలర్‌షిప్ పొందిన నర్సింగ్‌రావు ఆహ్వానం మేరకు శనివారం మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుర్తింపు కార్డుల అందజేత


గుర్తింపు కార్డులు అందజేస్తున్న డైరెక్టర్ సంధ్యారాణి, సతీష్‌కుమార్ పటేల్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వెంకటేశ్వరనగర్ పీజేఆర్ ఫంక్షన్ హాలులో మున్నూరు కాపు మహిళా పరపతి సహకార పొదుపు సంఘం సభ్యులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు శనివారం డైరెక్టర్ పర్వత సంధ్యారాణి, సతీష్ కుమార్ పటేల్ అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సిఇఓ పి. పురుషోత్తం రావు, బల్కంపేట ఎల్లమ్మగుడి ఈఓ అన్నపూర్ణ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని సంకల్ప్ ప్రింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. వీరి ఆధ్వర్యంలో 2013 నుంచి వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 9న సంస్థ 10వ వార్షికోత్సవం పురస్కరించుకొని కూకట్‌పల్లిలోని చింతపట్ల వెంకయ్య పార్కు ఆవరణలో ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నారు.

రెమెడీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట్‌రోడ్డులోని సెవెన్‌హిల్స్ కాలనీలో శేషాద్రి అపార్ట్‌మెంట్ బ్లాక్‌లో రెమెడీ హాస్పటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కేపీహెచ్‌బీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్ హాజరై ప్రారంభించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల వైద్య సేవలను వినియోగించుకున్నారు. అనంతరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన రెమెడీ ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు.

త్వరలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడతాం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్ నగర్ ఫేజ్ 1లోని వాంబే బ్లాక్ నెంబర్ 50, 51 వద్ద డ్రైనేజీ నిర్మాణం పూర్తయి చాలా కాలం అవుతున్న సీసీ రోడ్డు నిర్మించలేదని కాలనీ వాసులు స్థానిక కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా కాలనీలో పాదయాత్ర చేసి సమస్యను శనివారం స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన సీసీ రోడ్డు నిర్మాణం కోసం ఎస్టిమేషన్ వేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కార్మికులంతా ఏకం కావాలి

చింతల్: కుత్బుల్లాపూర్ ప్రాంత జలమండలి (డివిజన్ 12) ఔట్‌సోర్సింగ్ కార్మికులు భవిష్యత్తు కార్యాచరణ సమావేశాన్ని శనివారం చింతల్ హెచ్‌ఎంటీ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా యూనియన్ జనరల్ సెక్రటరీ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఐక్యంగా ఉంటే ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనవచ్చని, జీవో నెంబర్ 14–60 ద్వారా వేతనాలు పెరిగేలా యూనియన్ కృషి చేస్తుందని, దానికి అందరూ కలిసికట్టుగా రావాలని తెలియజేశారు.

మోదీ పర్యటనను నిరసిస్తూ ధర్నా


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న బీఎస్ సుదర్శన్, రాజశేఖర్, ఎం.శంకర్

కూకట్‌పల్లి: రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని మోదీ రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి వ్యతిరేకంగా బాలానగర్‌లోని వై జంక్షన్ దగ్గర సీపీఎం నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు బీఎస్ సుదర్శన్, ఐలాపురం రాజశేఖర్, ఎం.శంకర్‌లు పాల్గొని మాట్లాడుతూ సింగరేణి బొగ్గు గనులకు టెండర్లు పిలిచిన నరేంద్రమోదీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదని విమర్శించారు తెలంగాణకు తీరని అన్యాయం చేసిన ప్రధాని నరేంద్రమోదీ, వందేభారత్ రైలు ప్రారంభం కోసం హైదరాబాద్ పర్యటనకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్నామన్నారు. విభజన హామీలైన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, సాగునీటి ప్రాజెక్టులకు జాతీయ హోదా, గిరిజన విశ్వవిద్యాలయం వంటి రాష్ట్ర హామీలు అమలు చేయని నరేంద్రమోడీకి తెలంగాణలో అడుగుపెట్టే నైతిక హక్కు లేదన్నారు.

కార్యకర్తల్లో జోష్

కూకట్‌పల్లి: ప్రధానమంత్రి మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో శనివారం కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ సభకు తరలి వచ్చిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. మోదీ సందేశంతో తెలంగాణ బీజేపీ కార్యకర్తల్లో కొత్తజోష్ వచ్చిందన్నారు. తనదైన పాలనతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని కొనియాడారు.


మోదీ సభకు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో తరలి వెళ్లిన బీజేపీ నాయకులు

సంస్కృతి సంప్రదాయాల గురించి వివరించాలి


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మోతీనగర్: తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య మరింత సంబంధాలు పటిష్టపర్చేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జన్‌నెక్స్ పాఠశాల కరెస్పాండెంట్ జితేంద్ర పేర్కొన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ గాయత్రీనగర్‌లోని జెన్‌నెక్స్ పాఠశాలలో బాండింగ్ విత్ పేరెంట్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ జితేంద్ర మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు బాల్య దశలోనే సంస్కృతి సంప్రదాయాలతో పాటు కుటుంబ వ్యవస్థ, కుటుంబంలోని పెద్దల పట్ల గౌరవ మర్యాదలు పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

సులువుగా విద్యా బోధన చేయాలి

- భారత ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ మాజీ సెక్రటరీ అనిల్ స్వరూప్
- ఇంటిగ్రేటెడ్ ప్రీస్కూల్ టీచర్స్ ట్రైనింగ్ అకాడమీ ఫెస్ట్

మాదాపూర్: వినూత్నమైన ఉపకరణాలతో విద్యా బోధన సులువుగా ఉంటుందని, పిల్లలు వెంటనే అర్థం చేసుకుంటారని భారత ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ మాజీ సెక్రటరీ అనిల్ స్వరూప్ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ఇంటిగ్రేటెడ్ ప్రీస్కూల్ టీచర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఐపీటీటీఏ) ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పాఠశాల విద్య ఎంతో అవసరమన్నారు. భారతదేశంలో ఆలోచనలకు కొరత లేదని వాటిని నిలదొక్కుకునేందుకు అనేక సవాళ్ళను అధిగమించాలన్నారు. ఈ ప్రదర్శనలో 100కి పైగా వినూత్న బోధన సహాయ ఉపకరణాలు, 300 నమూనాలు ప్రదర్శనలో ఉంచారు. విద్యాబోధన ఉపకరణాలలో తోలుబొమ్మలు, ఇంటరాక్టివ్ పుస్తకాలు, మల్టీ సెన్సోరియల్ క్రియేటివ్ టెక్నిక్‌లు, లైవ్ కౌంటర్లు, టేక్ అవేలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ నిపుణురాలు సుల్తానా మొయిద్, ఐపీటీటీఏ డైరెక్టర్ సోనాల్ ఆండ్రూస్‌తో పాటు వివిధ స్కూళ్ల ప్రిన్సిపల్స్, టీచర్లు పాల్గొన్నారు.


ఫెస్ట్‌ను తిలకిస్తున్న భారత ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ మాజీ సెక్రటరీ అనిల్ స్వరూప్

సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సుభాష్‌నగర్: సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ మల్లారెడ్డినగర్ నూతన సంక్షేమ సంఘం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, ప్రధాన కార్యదర్శి సికిందర్‌రావులతో కలిసి కమిటీ సభ్యులు శనివారం కార్పొరేటర్ రావుల శేషగిరిని మర్యాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను అభినందించిన ఆయన మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయసహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు.

14 నుంచి ఇంటింటికీ సీపీఐ

నిజాంపేట్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఈ నెల 14 నుండి నెల రోజుల పాటు ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బాచుపల్లి మండ సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. శనివారం సీపీఐ మండలి సమితి సమావేశం యాదయ్య అధ్యక్షతన ఇంద్రన్న కాలనీలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాస్ మాట్లాడుతూ సీపీఐ జాతీయ నాయకత్వం పిలుపుతో బీజేపీ హటావో.. దేశ్‌కో బచావో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇందులో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు.

జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలి

నిజాంపేట్: మహనీయుల జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు మేకల నాగేష్ అన్నారు. శనివారం ప్రగతినగర్‌లోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాగేష్ మాట్లాడుతూ ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు పూలే, ఏప్రిల్14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీఆర్ అంబేద్కర్‌ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేదుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీలకు ,కులమతాలకు అతీతంగా జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సాయిలు మల్లికార్జున్, జలగం చంద్రయ్య, మేడ సంజీవ పాల్గొన్నారు.

అన్ని మతాల అభ్యున్నతికి కృషి

చింతల్: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని మతాల అభ్యున్నతికి కృషి చేస్తోందని చింతల్ డివిజన్ కార్పొరేటర్ రషీదా బేగం అన్నారు. శనివారం వివేకానంద నగర్ షాబుద్దీన్ బస్తీలోని నూర్ మసీద్‌లో రంజాన్‌ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన రంజాన్ తోఫాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ రఫీ, శేఖర్ రావు, ప్రభాకర్ గుప్తా, బసవరాజు, చాంద్ పాషా, యాదగిరి పాల్గొన్నారు.

సందడి చేసిన చిన్నారులు

కుత్బుల్లాపూర్: చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని సత్ జ్ఞాన్ స్కూల్ గ్రాడ్యూయేషన్ డే శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ బాకర్ ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల కరస్పాండెంట్ చింతల మల్లేశంతో కలిసి యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ సందర్భంగా యూకేజీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రైవేట్ పాఠశాలల సంఘం ఉపాధ్యక్షుడు చింతల మహేష్ యాదవ్, పాఠశాల అధ్యక్షురాలు చింతల విజయ లక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై అలసత్వం ప్రదర్శించవద్దు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్, హైదర్‌నగర్,ఆల్విన్‌కాలనీ, కూకట్‌పల్లి డివిజన్లలో పారిశుధ్య పనుల నిర్వహణపై శనివారం ఏఎంఓహెచ్ డాక్టర్ మమత, జీహెచ్‌యంసి శానిటేషన్ విభాగం అధికారులు ఎస్ఆర్‌పి, ఎస్ఎఫ్ఏలు, రాంకీ ప్రతినిధులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. పారిశుధ్య పనుల నిర్వహణపై అలసత్వం ప్రదర్శించవద్దని, అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదన్నారు. అధికారుల మధ్య సమన్వయలోపంతో పారిశుధ్యం పనులు కుంటుపడటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు. రాంకీ సంస్థ ఉద్యోగులకు అనుభవం లేకపోవడం, సరైన రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసుకోలేకపోవడంపై జీహెచ్‌యంసి అడిషనల్ కమీషనర్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలన్నారు. కాలనీలు, బస్తీలలో, ప్రధాన రహదారిపై చెత్త కుప్పలు పేరుకుపోవడంతో వర్షాల వల్ల డ్రైనేజీలో చెత్త నుంచి నీటి ప్రవాహం సాగకుండా వరదలకు కారణం అవుతోందని, దీంతో అంటురోగాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉందన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణ ఇకనుంచైనా సక్రమంగా జరిగేలా చూడాలని, ఏఎంఓహెచ్‌ల పర్యవేక్షణ ఎప్పుడు ఈ విధంగానే ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, తదితరులు పాల్గొన్నారు.


రాంకీ సంస్థ ప్రతినిధులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

భీమా జ్యువెలరీ షాపు ప్రారంభం



కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన భీమా జ్యువెలరీ షాపును ప్రముఖ సినీతార రాశిఖన్నా, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ. శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విభజన హామీలు నెరవేర్చని కేంద్ర ప్రభుత్వం

రంగారెడ్డినగర్: ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణాకు దక్కాల్సిన వాటాను ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. శనివారం రాష్ట్ర పర్యటనకు ప్రధాని మోడీ వస్తున్న నేపథ్యంలో వామపక్షాల ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో సింగరేణి సంస్థను ప్రైవేట్ పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఉక్కు పరిశ్రమ, గిరిజన అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ల హామీలు ఇచ్చి నేటికి నెరవేర్చడం లేదని ఆరోపించారు.


షాపూర్‌నగర్‌లో నిరసన తెలుపుతున్న వామ పక్ష పార్టీల నాయకులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి/రాయదుర్గం: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ప్రశాంత్‌హిల్స్‌లో పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శనివారం ఆయన పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత్‌హిల్స్‌కాలనీలో నెలకొన్న అవుట్‌లెట్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. డ్రైనేజీ, రోడ్ల పునరుద్ధరణ, అసంపూర్తి రోడ్లను త్వరలో వేస్తామన్నారు. ప్రశాంత్‌హిల్స్‌లోని చెరువు సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

రాయదుర్గంలో..

రాయదుర్గంలోని గోరెంకబస్తీలో ఎమ్మెల్యే గాంధీ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూజీడీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాగా వర్షాకాలం రోడ్ల మీద నీరు నిలబడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అలాగే డ్రైనేజీ, మంచినీరు, వీధిదీపాలు, విద్యుత్ తదితర సమస్యలను వివరించారు. అన్నింటిని దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్ ముదిరాజ్, సతీష్, శ్రీకాంత్, సత్యనారాయణ, వసీమ్, అశోక్, జగదీష్, అశోక్‌రెడ్డి, ప్రసాద్, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


రాయదుర్గంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెలే అరెకపూడి గాంధీ

నూతన కార్యాలయం ప్రారంభం

గచ్చిబౌలిలోని టీఎస్ హౌసింగ్ బోర్డు కాలనీలో పునర్నిర్మించిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, కాలనీ అధ్యక్షులు నర్సింహారావు, సూర్య ప్రకాశ్, శివశంకర్, ప్రసాద్, సత్యనారాయణ, ప్రకాశ్, నాగార్జున ,కాలనీవాసులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


పేట్‌బషీరాబాద్ పోలీసులు సీజ్ చేసిన 30 కిలోల గంజాయి ప్యాకెట్లు

కుత్బుల్లాపూర్: గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన మేరకు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన ఉపేందర్ (28), మహబూబాబాద్ జిల్లా గుండెపూడి తాండాకు చెందిన తేజావత్ ఉపేందర్(38) గత కొంత కాలంగా గంజాయి విక్రయాలు చేపడుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం పేట్‌బషీరాబాద్ పోలీసులకు గంజాయి రవాణాపై విశ్వసనీయ సమాచారం అందడంతో సుచిత్ర చౌరస్తాలో ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల చెకింగ్ చేపట్టారు. ప్యాసింజర్ ఆటోలో తనిఖీలు చేపట్టగా 15 ప్యాకెట్లలో 30 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో నిందితులను స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా ఆనంద్ అనే వ్యక్తి నుండి రూ.50వేలకు గంజాయిని కొలుగోలు చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుండి 30 కిలోల గంజాయి, ప్యాసింజర్ ఆటో, మూడు మొబైల్ ఫోన్‌లు, రూ.6,500 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.


నిందితులు ఉపేందర్, తేజావత్ ఉపేందర్